పల్లెల్లో సంక్రాంతి శోభ

- మహిళలకు ముగ్గుల పోటీలు
- నియోజకవర్గంలోని 90 గ్రామాల్లో పోటీలు
- విజేతలకు బహుమతుల ప్రదానం
- ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- అందరి జీవితాల్లో కొత్త వెలుగు నిండాలి : ఎమ్మెల్యే రాజా

సీతానగరం: ఈ కొత్త ఏడాదిలో సంక్రాంతి పండగ సందర్భంగా అందరి జీవితాల్లో కొత్త వెలుగులు నిండాలని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. సంక్రాంతిని పురస్కరించుకొని రాజానగరం నియోజకవర్గంలోని 90 గ్రామాల్లో జక్కంపూడి రామ్మోహన్‌రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని ముగ్గులు వేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శనివారం రఘుదేవపురంలో చిట్టూరి శ్రీనివాస్ వీధిలో హరిదాసు, గంగిరెద్దులు, గొబ్బెమ్మలు, రంగవల్లుల ప్రత్యేక ఆకర్షణతో నిలిచిన సంక్రాంతి సంబరాల్లో ఎమ్మెల్యే పాల్గొని భోగి మంటలు వెలిగించారు. రాపాకలో జరిగిన ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేశారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి వాషింగ్ మెషీన్, రెండో బహుమతి మిక్సీ, మూడో బహుమతి డిన్నర్ సెట్‌లు, కన్సోలేషన్ బహుమతులు ఎమ్మెల్యే రాజా చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు పండుగ సంక్రాంతి అనగానే మనకు మొదటి గుర్తుకొచ్చేది ముగ్గులని, అవి గ్రామాల్లో ఉండడం వల్ల సందడి నెలకొంటుందన్నారు. కొత్త ఏడాదిలో వచ్చే ఈ పండగ మీ అందరి జీవితాలలో కొత్త వెలుగులను నింపాలని కోరుకుంటూ అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఇందుగుమిల్లి చంద్రలీల, ఉపసర్పంచ్ పట్టపగలు విష్ణుప్రసాద్, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, పార్టీ నాయకులు గెద్దాడ త్రిమూర్తులు, చల్లమళ్ల సుజీరాజు, కవల కృష్ణమూర్తి, పిచ్చుకుల రవికుమార్, రావూరి రామరాజు, ధాకే రఘు తదితరులు పాల్గొన్నారు.


మధురపూడిలో ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు అందజేస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు


రఘుదేవపురంలో భోగి మంటలు వెలిగించిన ఎమ్మెల్యే జక్కంపూడి రాజా


ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

కోరుకొండలో..

మధురపూడి: కోరుకొండ మండలంలో మధురపూడి, నర్సాపురం తదితర గ్రామాల్లో శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు వేసిన ముగ్గులను వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి పరిశీలించారు.ఈ పోటీల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనడాన్ని ఆమె అభినందించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. ప్రథమ బహుమతిగా వాషింగ్ మెషీన్, ద్వితీయ బహుమతిగా మిక్సీ, తృతీయ బహుమతిగా డైనింగ్ సెట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ కోరుకొండ మండలం కో-కన్వీనర్ గణేశుల పోసయ్య, నాయకులు బత్తిన త్రిమూర్తులు, ఇండిగమెల్లి సత్యనారాయణ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యం.. జగన్‌తో సాకారం

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- మర్రిపూడిలో సచివాలయం, ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్ల నూతన భవనాలు ప్రారంభం

రంగంపేట: జాతిపిత మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ద్వారా సాకారం చేశారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి పేర్కొన్నారు. రంగంపేట మండలం మర్రిపూడి గ్రామంలో రూ.43.60 లక్షలతో నూతనంగా నిర్మించిన సచివాలయం, రూ. 23.94 లక్షలతో నిర్మించిన ఆర్బీకే, రూ.20.80 లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్ల భవనాలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో గ్రామాల్లో జనన, మరణ ధ్రువపత్రాలు, ఇళ్ల స్థలాల పట్టాలు, కుల ధ్రువీకరణ తదితర సేవలు పొందాలంటే కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టగానే ప్రతీ 2 వేల జనాభా గల గ్రామానికి సచివాలయాన్ని ఏర్పాటు చేసి, ప్రతీ 50 కుటుంబాలకు వలంటీర్‌ను నియమించారన్నారు. సచివాలయాల ద్వారా సుమారు 630 పైగా సేవలు అందిస్తూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదర్శ పాలనను సాగిస్తున్నారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా జరుగుతున్న మేలును గుర్తించి మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని కోరారు. అదేవిధంగా వ్యవసాయాన్ని పండగగా మార్చేందుకు ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటుచేశారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, జెడ్పీకోఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు, అనపర్తి ఏఎంసీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయిల్, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి పాలాటి నాగేశ్వరరావు, సొసైటీ చైర్మన్ పోతుల బులివీర్రాజు, సర్పంచ్ వేము మాధవి, ఉప సర్పంచ్ మేడిది చక్రం, పంచాయితీరాజ్ జేఈ కె.శ్రీనివాసరావు, కార్యదర్శి గౌరీశాంతి పాల్గొన్నారు.


మర్రిపూడిలో వెల్‌నెస్ సెంటర్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

మెట్ట రైతులకు వరం.. వైఎస్సార్ జలకళ పథకం


ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న వైఎస్సార్ జలకళ పథకం రైతులకు ఒక వరమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రమైన రంగంపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వైఎస్సార్ జలకళ పథకంలో మంజూరైన బోర్ల మోటార్లను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి రైతులకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2020 నుంచి ప్రభుత్వం వైఎస్సార్ జలకళ పథకం ద్వారా రైతులకు ఉచితంగా బోర్లు, మోటార్లు మంజూరు చేస్తోందన్నారు. జిల్లాలో రంగంపేట మండలంలో అత్యధికంగా వైఎస్సార్ జలకళ పథకంలో 295 మంది రైతులకు బోర్లు డ్రిల్లింగ్ చేశారని, అందులో 188 మందికి మోటార్లు మంజూరయ్యాయని చెప్పారు. వైఎస్సార్ జలకళ పథకం ద్వారా బోరు వేసుకున్న ప్రతీ రైతుకు రూ.5 లక్షల లబ్ధి చేకూరుతుందని వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పి.రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు, అనపర్తి ఏఎంసీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయిల్, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, సొసైటీ చైర్మన్ పోతుల బులి వీర్రాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి పాలాటి నాగేశ్వరరావు, ఏపీఓ జి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి వీరుళ్లమ్మ జాతర

అనపర్తి: భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి అనపర్తి గ్రామ దేవత శ్రీవీరుళ్లమ్మ జాతరకు ముస్తాబైంది. ఎంతో ప్రతిష్టాత్మకంగా జరిగే ఈ జాతర, తీర్థాన్ని ఏటా భోగి పండగ నుంచి ఐదు రోజుల పాటు నిర్వహించటం ఆనవాయితీ. దీంట్లో భాగంగా 14వ తేదీ ఆదివారం నుంచి 19వ తేదీ వరకూ జాతర ఉత్సవాలు నిర్వహించనున్నారు. వీరుళ్ళమ్మ జాతర అత్యంత వైభవోపేతంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆలయాన్ని అత్యంత సుందరంగా ముస్తాబుచేశారు. 14న భోగి సందర్భంగా వివిధ అంశాల్లో మహిళలకు ప్రత్యేక పోటీలు ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అదేవిధంగా 15వ తేదీ సంక్రాంతి రోజున అమ్మవారి జాతర, 16, 17, 18, 19 తేదీల్లో అమ్మవారి తీర్థం జరగనున్నాయి. జాతర సందర్భంగా హైదరాబాద్ వారి ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. అనపర్తి పరిసర ప్రాంతాలతో బాటు అమ్మవారిని దర్శించుకునేందుకు ఒడిశా, కర్ణాటక రాష్ట్రాలతో పాటు వైజాగ్, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు విచ్చేసి మొక్కులు చెల్లించుకుంటారు. అమ్మవారి జాతర సందర్భంగా అనకాపల్లికి చెందిన బాబుల్ డెకరేషన్ సౌండ్స్, లైటింగ్ వారిచే ఏర్పాటు చేసిన లైటింగ్ సెట్టింగ్స్ అందరినీ అబ్బు రపరుస్తున్నాయి. స్థానిక దేవీచౌక్ నుంచి రైల్వే స్టేషన్ వరకూ, ప్రధాన వీధుల్లో, ఆలయం వద్ద సుమారు 50 అడుగుల ఎత్తులో ఏర్పాటు చేసిన విద్యుత్ వెలుగుల్లో గ్రామం కాంతులీనుతోంది.


వీరుళ్లమ్మ అమ్మవారు


మిరుమిట్లు గొలుపుతున్న విద్యుత్ కాంతుల సెట్టింగ్


అనపర్తి దేవీచౌక్ వద్ద విద్యుత్ దీపాలతో ఏర్పాటు చేసిన సెట్టింగ్

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

పెదపూడి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. జి.మామిడాడలో ధ్వజ స్తంభం వద్ద నిర్మించిన సచివాలయం, మార్కెట్ సెంటర్ సమీపంలో నిర్మించిన సచివాలయం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాలు, సీసీ రోడ్లను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదరికమే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న గొప్ప మనసున్న నేత ముఖ్యమంత్రి జగన్ అని కొనియాడారు. సచివాలయ వ్యవస్థతో సంక్షేమ పథకాలన్నీ లబ్ధిదారుల ఇంటి ముంగిటకే అందుతున్నాయన్నారు. మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌ను, ఎమ్మెల్యేగా తనను భారీ మెజార్టీతో గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, సర్పంచ్ లంక మున్ని, ఉప సర్పంచ్ మేడపాటి తాతారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, వైస్ ఎంపీపీ ద్వారంపూడి పద్మారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు కేతా సత్యశ్రీలక్ష్మి, కర్రి వెంకటపద్మావతి, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు కర్రి శ్రీవెంకటరెడ్డి, పార్టీ గ్రామ కన్వీనర్ ద్వారంపూడి సూర్యనారాయణ రెడ్డి, పైన గ్రామ పీఏసీఎస్ చైర్మన్ సబ్బెళ్ల అమ్మిరెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి మండ రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


జి.మామిడాడలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

నర్సరీలో పల్లె సంక్రాంతి లక్ష్మి



కడియపులంకలోని శ్రీసత్యదేవా నర్సరీ డాక్టర్ పుల్లా సత్యనారాయణ (చంటియ్య) నర్సరీలో ఈ సంవత్సరం మొదటి పండగ సంక్రాంతి సందర్భంగా మా నర్సరీలో పల్లె సంక్రాంతి లక్ష్మి(పౌశ్య లక్ష్మి) అనే కూర్పును ఏర్పాటు చేశారు. ఈ కూర్పులో పల్లెగుడిసె, లక్ష్మీదేవి, పాలకుండ, చెరకు గడలు, కోడిపుంజుల ఆకారాలను తయారు చేశారు. ఈ కూర్పులో 15000 మొక్కలు, అనేక వేల పూలరేకలతో రెండు రోజులు 10 మంది శ్రామికులు పనిచేసినట్టు తెలిపారు. రైతులకు, బంధుమిత్రులకు పుల్లా పెద్ద సత్యనారాయణ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. – కడియం

సంప్రదాయ క్రీడలకే ప్రాధాన్యమివ్వాలి

జిల్లా ఎస్పీ జగదీష్

కడియం: చట్ట వ్యతిరేక క్రీడల జోలికి పోకుండా సంప్రదాయక ఆటలకే ప్రాధాన్యమివ్వాలని జిల్లా ఎస్పీ పి.జగదీష్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో నిర్వహించిన జిల్లా స్థాయి షటిల్ టోర్నమెంట్ విజేతలకు బహుమతి ప్రదానోత్సవం శుక్రవారం రాత్రి జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ యువత క్రిమినల్ కేసుల్లో చిక్కుకుంటే వారి భవిష్యత్తే నాశనమవుతుందని, సంక్రాంతి పండుగ నేపథ్యంలో సంప్రదాయక క్రీడల్లో మాత్రమే పాల్గొనాలని సూచించారు.

35కు పైగా జట్లు పాల్గొన్న ఈ పోటీలు లోకల్, నాన్‌లోకల్ విభాగాలుగా నాలుగు కేటగిరీలుగా నిర్వహించారు. రెండు రోజుల పాటు హోరాహోరీగా సాగిన ఈ పోటీల్లో నాన్‌లోకల్ విభాగంలో కాకినాడకు చెందిన బీజీ సాయి, పి. ప్రవీణ్ జట్టు, జి.సాయి మనీష్, ఎస్‌కే నవాబుల్లా, రాజమహేంద్రవరంకు చెందిన జీవీ చైతన్య, కె.చైతన్యల జట్లు విజయం సాధించాయి. లోకల్ విభాగంలో వేమగిరికి చెందిన సున్నా సూర్య, తోటస్వామి జట్టు, కడియపులంకకు చెందిన గోరుబాబు, సాయిల జట్టు, ధవళేశ్వరానికి చెందిన వెంకటల్, శ్రీధర్‌ల జట్టు, కడియం గ్రామానికి చెందిన అంజి, బాబీల జట్టు విజయం సాధించారు. విజేతలకు మొదటి బహుమతికి రూ.10వేలు, రెండో బహుమతిగా రూ.6వేలు, షీల్డ్‌లను ఎస్పీ చేతుల మీదుగా అందజేశారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు, దక్షిణ మండలం డీఎస్పీ కె.శ్రీనివాసులు, ఈస్ట్ జోన్ డీఎస్పీ కిషోర్‌కుమార్, కడియం ఇన్‌స్పెక్టర్ పీవీజీ తిలక్, టుటౌన్ ఇన్‌స్పెక్టర్ రాయుడు విజయ్‌కుమార్, కడియం ఎస్ఐ బాలాజీ సుందం, సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా టోర్నీ నిర్వహణలో రిఫరీగా వ్యవహరించిన ఎన్వీ భద్రంను పోలీసు ఉన్నతాధికారులు ఘనంగా సత్కరించారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న జిల్లా ఎస్పీ జగదీష్

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ విద్యుత్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా గణేష్


గణేష్‌ను సత్కరిస్తున్న సభ్యులు

మధురపూడి: కోరుకొండ మండలం మధురపూడిలో విద్యుత్‌శాఖ ఉద్యోగిగా బాధ్యతలు నిర్వహిస్తున్న పసుపులేటి గణేష్ వైఎస్సార్ సీపీ విద్యుత్ ఉద్యోగుల సంఘం రాజమహేంద్రవరం డివిజన్ అధ్యక్షుడిగా ఎంపికయ్యారు. శనివారం రాజ మహేంద్రవరంలోని రజక సామాజిక వర్గం భవనంలో నిర్వహించిన సంఘం సర్వసభ్య సమావేశంలో ఎంపిక జరిగింది. సంఘం జిల్లా నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు పసుపులేటి గణేష్‌తో పాటు, కార్యదర్శిగా కె.చిన్నారావు, ఉపాధ్యక్షుడు, కోశాధికారితో పాటు, 9 మంది కమిటీ నియామకమైంది. ఈ సందర్భంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులను సభ్యులు సత్కరించారు.

రెడీమేడ్ భోగి పిడకలు


మార్కెట్లో విక్రయిస్తున్న భోగి పిడకలు

రాజానగరం: సంక్రాంతి పండగలో భాగంగా మొదటి రోజు వచ్చే భోగి పండగ తెల్లవారుజామున వేసే భోగి మంటలతో ప్రారంభమవుతుంది. ఈ భోగి మంటలో చిన్నారుల నుంచి పెద్దల వరకు ఎంతో భక్తి శ్రద్ధలతో భోగి పిడకలతో తయారు చేసిన దండలను వేయడం సంప్రదాయంగా వస్తోంది. ఆవు పేడతో తయారు చేసే భోగి పిడకలను దండలుగా కట్టి భోగి మంటలో వేస్తుంటారు. అయితే ఆధునిక సమాజంలో మానవ జీవన విధానమంతా యాంత్రికమై పోయిన ప్రస్తుత సమయంలో ఆవు పేడను సేకరించి, పిడకలు వేసి, దండలు కట్టేంత తీరుబడి జనానికి ఉండడం లేదు. దీనితో కొంతమంది వ్యాపారులు పూలు, పండ్లతోపాటు భోగి పిడకలతో తయారు చేసిన దండలు కూడా మార్కెట్‌లో రడీమేడ్‌గా విక్రయిస్తున్నారు. ఒక్కో దండ సైజును బట్టి రూ.30 నుండి రూ.50 లు వరకు ధర పలుకుతోంది.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన


కొమరిపాలెంలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: మండలంలోని కొమరిపాలెంలో రూ.33 లక్షల ఖర్చుతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల భవిష్యత్తు కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధితో కూడిన సంక్షేమాన్ని అమలుచేస్తున్నారన్నారు. ప్రజలు గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి మధ్య బేధం గమనించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సంక్షేమ స్థాయీ చైర్‌పర్సన్ రొంగల పద్మావతి, సర్పంచ్ వాసంశెట్టి రవికుమార్, ఉపసర్పంచ్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీ బొబ్బలి గంగా భవాని, పందలపాక సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి జయంతి

మధురపూడి: దోసకాయలపల్లి నంది సెంటర్‌లోని భక్తాంజనేయ స్వామి జయంత్యుత్సవం శనివారం ఘనంగా జరిగింది. స్వామి వారిని కోరుకొండ జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, ఎంపీటీసీ బేదంపూడి పాప, వైఎస్సార్ సీపీ నాయకులు కడవల శివ, గొల్లవిల్లి మురళి, టిడీపీ నాయకులు బొడ్డు వెంకటరమణ చౌదరి, మార్ని రాములు తదితరులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భారీ అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

పెదపూడి: మండలంలో ఎవరైనా కోడి పందేలు, జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పెదపూడి ఎస్‌ఐ శోభన్ కుమార్ హెచ్చరించారు. మండలంలో ఏటా కోడిపందేలు నిర్వహించే పెదపూడి, జి.మామిడాడ, గండ్రేడు, చింతపల్లి తదితర గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కోడిపందేలకు సిద్ధం చేస్తున్న బరుల వద్ద ఏర్పాట్లను ఆయన తొలగించి నిర్వాహకులను హెచ్చరించారు.

జీతాలు చెల్లించకుంటే సమ్మె


సత్యసాయి డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్ట్ వద్ద వర్కర్లు

సీతానగరం: ఐదు నెలల బకాయి జీతాలు వెంటనే అందించకపోతే ఈనెల 17వ తేదీ నుంచి సమ్మె చేస్తామని శ్రీసత్యసాయి డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్ట్ మేంటినెన్స్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు పాటి శేషరావు, కట్టమూరి వీరబాబు హెచ్చరించారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పథకంలో పని చేసే వర్కర్లందరూ జీతాలు లేక పలు ఇబ్బందులు పడుతున్నామని, సంక్రాంతి పండగకు ఇస్తామని కాంట్రాక్టర్ తాళ్లూరి సత్యనారాయణ నమ్మించి మోసం చేశారని వాపోయారు. కాంట్రాక్టర్ వీవీ శ్రీనివాసరావు ఐదు నెలలుగా జీతాలు ఇవ్వలేదన్నారు. గతం నుంచి చెల్లిస్తున్న పీఎఫ్ ఈఎస్‌ఐ కూడా చెల్లించడంలేదని ఆవేదన చెందారు. జీతాలు అందించకపోతే సమ్మెబాట పడతామన్నారు. ఈ కార్యక్రమంలో కొట్టు తాతాజీ, పాలడి శ్రీను, జి.రామకృష్ణ, ఒంబోలు బాబి, ముళ్ళపూడి వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

పతంగులతో చిన్నారుల సందడి


పందలపాకలో గాలిపటాలు ఎగురవేస్తున్న చిన్నారులు

బిక్కవోలు: పద.. పదవే బంగారు గాలిపటమా అంటూ చిన్నారులు సందడి చేస్తున్నారు. సంక్రాంతి పండగ సందర్భంగా విద్యార్థులంతా పతంగుల సంబరాల్లో మునిగితేలుతున్నారు. మార్కెట్‌లో దుకాణాల వద్ద వివిధ రంగులు, ఆకృతుల్లో తయారుచేసిన గాలిపటాలు దర్శనమిస్తున్నాయి. పిల్లలు ఇష్టపడే కార్టూన్లతో పతంగులు అమ్మకానికి ఉంచారు. కొందరు చిన్నారులు ఇంట్లోనే కాగితాలతో స్వయంగా గాలిపటాలను తయారుచేసుకుని ఎగురవేస్తున్నారు. గాలిపటాలను చేతబూని వీధుల్లో తిరుగుతూ డాబాలు, అపార్ట్‌మెంట్ల పైనుంచి, క్రీడా మైదానాల్లో ఎగురవేస్తున్నారు.

సేవింగ్స్ ఖాతాలకు ప్రత్యేక కౌంటర్

ప్రకాశం నగర్: ఈ నెల 16 నుంచి 31వ తేదీ వరకూ రాజమహేంద్రవరం ప్రధాన తపాల కార్యాలయంలో పోస్టాఫీస్ సేవింగ్స్ ఖాతాల ప్రారంభ ప్రక్రియ కోసం ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు పోస్టల్ సూపరింటిండెంట్ పి.కోమల్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తపాల శాఖ ఉత్తరాల బట్వాడాయే కాకుండా బ్యాకింగ్, బీమా, ఆధార్, పాస్‌పోర్ట్ వంటి సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. సేవలను నగర వాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శ్రీమహాలక్ష్మి అమ్మవారికి పూజలు

సీటీఆర్ఐ: గాడాలలోని శ్రీమహాలక్ష్మి సమేత శ్రీ చిన్న వేంకటేశ్వరస్వామివారి పీఠంలోని అమ్మవారిని ప్రముఖ సీనియర్ సినీనటుడు మొలేటి బాలాజీ(ఆంధ్రా రజినీకాంత్) శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠాధిపతి శ్రీమాన్ డాక్టర్ చిన్న వెంకన్నబాబు స్వామీజీ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా బాలాజీ త్వరలో తన తీయబోయే కొత్త సినిమా స్క్రిప్టును అమ్మవారి పాదాల దగ్గర పెట్టి పూజలు నిర్వహించారు. సినిమా పేరుని 'త్రీ నేత్ర' అని వెల్లడించారు. ఈ ఆలయాన్ని దర్శించుకున్న వారికి సమస్త బాధలు తొలగుతాయని రాశులు, నక్షత్రాలతో కూడిన ఆలయం ఒక అద్భుతమైన దేవాలయమని విన్నానన్నారు. కాని ఇప్పుడు కళ్లారా చూస్తున్నానన్నారు. అనంతరం కొత్త సినిమా స్క్రిప్టును అమ్మవారి పాదాల దగ్గర ఉంచి పీఠాధిపతి శ్రీమాన్ డాక్టర్ చిన్న వెంకన్నబాబు స్వామీజీ పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మనగుడి-మనసేవ భారతీయ ఆధ్యాత్మిక సేవాసమితి చైర్మన్ ధరణికోట దుర్గావెంకట హేమావతి, జాతీయ కార్యదర్శి చవ్వాకుల శ్రీనివాసరావు, తోట మణి స్వరూప్, జాతీయ సంయుక్త కార్యదర్శి. టాటా సత్యనారాయణ, ఉభయ రాష్ట్రాల చైర్మన్ మతల రమేష్, రాష్ట్ర చైర్మన్ అంబటి శ్రీనివాసరావు, ద్రాక్షారామ శ్రీ రాజరాజేశ్వరి పీఠాధిపతులు తాలూరి సాంబ శివరావుస్వామి రాష్ట్ర డైరెక్టర్ పడాల వీర వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.